

తెరుచుకున్న రైల్వే గేటు

నాగులపల్లి, వెలిమెల గ్రామస్థులకు ఊరట



రైల్వే గేట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రామచంద్రాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలోని ఈదులనాగుల పల్లి రైల్వే క్రాసింగ్ గేట్లు సోమవారం తెరుచుకున్నాయి. మార్చి 8వ తేదీన రైల్వే పనుల కారణంగా పది రోజుల పాటు రైల్వేగేట్లు మూసి వేస్తున్నట్టు రైల్వే అధికారులు నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు. పనులు పూర్తయినా నెల రోజులుగా గేట్లు తెరువలేదు. దీంతో ఈదులనాగులపల్లి, వెలిమెల గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై మే 19న 'పది రోజులని చెప్పి నెలలు కొద్దీ మూసి వేత' అనే కథనాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దీనిపై ఎంపీ రఘునందనన్‌రావు స్పందించి, కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న దృష్టికితీసుకువెళ్లారు. దీంతో, రైల్వేగేట్లను తెరిచారు. రైల్వేగేటు ప్రారంభించిన అనంతరం ఎంపీ మాట్లాడుతూ నాగులపల్లి రైల్వే టర్మినల్ అభివృద్ధికి కృషి చేస్తానని, గ్రామంలోకి రోడ్డు, రైల్వే రోడ్డు కోసం భూములు కోల్పోయిన స్థానికులకు తగిన పరిహారం ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, బీజేపీ నాయకులు రాంబాబు, లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిఘాపై నిర్లక్ష్యం

- మెదక్ బస్టాండ్‌లో భద్రత కరువు
- నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీ
- సీసీ కెమెరాలు లేకపోవటంపై సర్వత్రా విమర్శలు

7

పరిహారం కోసం
అసైన్డ్ రైతుల ఆందోళన

- ఘనపూర్‌లో రెవెన్యూ సదస్సు వద్ద బైఠాయింపు
- రెండు నెలల్లో పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ

7

జక్కపల్లి మోడల్ స్కూల్‌కు
ఆర్టీసీ బస్సును నడపాలి

7లో

చంద్రశేఖర్‌ను అభినందించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిపొందిన కొత్తగొల్ల చంద్రశేఖర్, సంఘం కార్మిక పోరాట సమితి నాయకులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అభినందించారు. ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు అండగా ఉండాలని అన్నారు. కార్మికులకు ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, ఉపాధ్యక్షులు కృష్ణ, విఠల్, కార్యదర్శి శ్రీనివాస్ రాజు, ప్రధాన కార్యదర్శి మల్లేశం, నాయకులు నజీర్, కిరణ్, వెంకట్‌రావ్, నర్సింహులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

కేజీబీవీల ఆధునీకరణకు రూ.1.48 కోట్లు

సంగారెడ్డి అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.1.48 కోట్లు కేటాయించింది. జిల్లాలో 17 కేజీబీవీలు ఉండగా అందులో ఐదు వేల మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. కొన్నేళ్లుగా నిర్వహణ, నూతన భవనాలకు నిధులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా పెయింటింగ్స్, తాగు నీటి సౌకర్యం, మేజర్, మైనర్ రిపేర్లు ఇతరత్ర సివిల్ వర్క్స్ పనులు చేపట్టనున్నారు. కేజీబీవీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేజీబీవీల ఆధునీకరణతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కానున్నాయి.

నర్సాపూర్ బీజేపీలో కోల్డ్‌వార్

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ మధ్య ముసలం

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ క్యాడర్‌లో అయోమయం

అదిష్ఠానం పట్టించుకోకపోవడంపై అసంతృప్తి


నర్సాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఓవైపు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి బీజేపీని నాయకత్వం ప్రయత్నిస్తుంటే.. నర్సాపూర్ నియోజకవర్గంలో నేతల మధ్య నేతల కోల్డ్‌వార్‌తో నలిగిపోతున్నది. ముఖ్య నాయకులు మాత్రం ఎవరికివారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తుండటంతో క్యాడర్‌లో అయోమయం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్య నాయకులే ఇలా వ్యవహరిస్తే తమకు అండగా నిలిచేవారెవరని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో బీజేపీకి ముఖ్య నాయకులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఉన్నారు. ఇద్దరికీ కొన్నిరోజులుగా పొసగడం లేదు. నియోజకవర్గంలో ఒకరు పాల్గొన్న కార్యక్రమంలో మరొకరు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వచ్చిన సమయంలో కూడా ఇద్దరు నాయకులు వేరువేరుగా కలుస్తుండటం విశేషం. శివ్వంపేట మండలం పెద్ద గొట్టిముక్లలో మూడు రోజుల క్రితం నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో మురళీధర్‌యాదవ్ వర్గంకు చెందినవారు పాల్గొనకపోవడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.



ఇద్దరు ముఖ్యనాయకులు ఒకరిపై ఒకరు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదులు కూడా చేసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో కిందిస్థాయి క్యాడర్ ఇబ్బందిపడుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతమవుతున్న తరుణంలో ఇద్దరు ముఖ్య నాయకుల మధ్య విబేధాలను తొలగించి, కలిసికట్టుగా పనిచేసేలా చూడాల్సిన రాష్ట్ర నాయకత్వం పట్టించుకోకపోవడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేల్కోకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ఎదురుదెబ్బ తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'వట్‌పల్లి మండలం మేడికుంద శివారులో నాలుగు విద్యుత్ స్తంభాలు పడిపోయేలా ఉన్నాయి. స్తంభాలు వంగిపోవడంతో విద్యుత్ వైర్లు చేతికందే స్థాయిలో వేలాడుతున్నాయి. ఈ ప్రమాదకర పరిస్థితిని చూసి రైతులు, బాటసారులు జంకుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాణాపాయం జరగకముందే వీటిని సరిచేయాల్సి ఉంది'.

'మాసాయిపేట మండల కేంద్రంలోని మహంకాళి ఆలయం వద్ద విద్యుత్‌ను సరఫరా చేసే మెయిన్‌లైన్ స్తంభం విరిగి ఏడాది కావొస్తున్నది. ఈ స్తంభం కూలిపోతే భారీ విద్యుత్ ప్రమాదంతోపాటు ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. అందుకే గ్రామస్థులు పదేపదే ఫిర్యాదులు చేసినా ఈ సమస్యను పరిష్కరించడం లేదు. ఇదే మండలం బొమ్మారం, కొప్పులపల్లి, అచ్చంపేట, హకీంపేట, రామంతపూర్, చెట్ల తిమ్మాయి పల్లిలోనూ అనేక సమస్యలున్నాయి'.



టేక్మాల్ నుంచి అచ్చన్నపల్లి వెళ్లే దారిలో కర్రలపై విద్యుత్ వైర్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

కర్రలే ఊతం..
ప్రాణాలు గాల్లో దీపం

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు, స్తంభాలు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఏడాదిలో

24 మంది రైతులు, 71 పశువులు మృత్యువాత

ఫిర్యాదులు అందుతున్నా చర్యలు జాప్యం

సాంకేతికత పెరిగినా మారని పరిస్థితులు

విద్యుత్ అధికారులు, సిబ్బందిపై విమర్శలు



నర్సాపూర్ మండలం గొల్లపల్లిలో..



మనోహరాబాద్ మండలం కోనాయపల్లిలో చేతికందేలా..



వట్‌పల్లి మండలం మేడుకుందలో ఒరిగిన స్తంభం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 16: నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్‌శాఖను అలసత్వం ఆవరించింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడడంతో పుట్టెడు సమస్యలు నెలకొన్నాయి. ఎప్పటికప్పుడు విద్యుత్ తీగలను, స్తంభాలను సరిచేయకపోవడంతో ప్రమాదాలు పొంచిఉన్నాయి. ప్రమాదాలతో నిండు ప్రాణాలు గాలిలో కలిసే ముప్పు పొంచిఉంది. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా కిందిస్థాయి సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వానాకాలం ప్రవేశించడంతో ప్రమాదల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నందున విద్యుత్‌శాఖ లోటుపాట్లపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో విషయాలు వెలుగుచూశాయి.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలుచోట్లా ఎప్పుడు విరిగిపడతాయోననే స్థాయిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఇక స్థంబాలను అమర్చకపోవడంతో రైతులే కర్రలను ఊతంగా పెట్టి తీగలను విస్తరించడం మరింత ప్రమాదకరంగా మారిందనే చెప్పాలి. ఈదురుగాలులకు, వర్షాలకు ఈ కర్రలు నేలవాలితే ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. వీటన్నింటినీ చక్కదిద్దాల్సిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సరైన పర్యవేక్షణ చూపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక వంగిపోయి కనిపిస్తున్న స్తంభాలు సైతం ముప్పును సూచిస్తున్నాయి. స్తంభాలు వంగడంతో

మిగతా 8వ పేజీలో

వానాకాలం.. వ్యాధుల ముప్పు

ఏటా పెరుగుతున్న సీజనల్ వ్యాధుల కేసులు

ముందు జాగ్రత్త చర్యలు మరిచిన అధికారులు

కరువైన అవగాహన కార్యక్రమాలు..

కానరాని సమన్వయ సమావేశాలు

మేల్కొనకపోతే తప్పదు ముప్పు



కందిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద నిలిచిన మురుగు

సంగారెడ్డి అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం వచ్చిందంటే చాలు సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతాయి. పైపులైన్ల లీకేజీలతో తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యాలబారినపడుతుంటారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు ఒక్కసారిగా పెరిగిపోతాయి. ఏటా ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా ముందుజాగ్రత్త చర్యలు కరువయ్యాయి.

గత నాలుగేళ్లలో నమోదైన కేసులు..

సంగారెడ్డి జిల్లాలో సీజనల్ వ్యాధుల కేసుల నమోదు ప్రతీ ఏటా పెరుగుతూ వస్తున్నది. డెంగీ 2021లో 128 కేసులు, 2022లో 301 కేసులు, 2023లో 333 కేసులు, 2024లో 299 కేసులు నమోదయ్యాయి. టైఫాయిడ్ 2021లో 2,227 కేసులు, 2022లో 3,544 కేసులు, 2023లో 2,152 కేసులు, 2024లో 1,910 కేసులు నమోదయ్యాయి. మలేరియా 2021లో రెండు, 2022లో రెండు కేసులు నమోదయ్యాయి. చికెన్‌గున్యా గతేడాది నాలుగు కేసులు నమోదయ్యాయి. డెంగీ, టైఫాయిడ్ కేసులు పెరుగుండటంతో ప్రజల్లో దడ మొదలైంది.

ముందు జాగ్రత్త చర్యలు ఏవీ?

సీజనల్ వ్యాధులు సోకకుండా సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టడం లేదు. మున్సిపల్, గ్రామపంచాయతీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సమన్వయ సమావేశాలు నిర్వహించి వ్యాధుల కట్టడి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు ఇప్పటి వరకు కానరాలేవు. పట్టణాలు, పల్లెలు, ఆవాస ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొని దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా

మిగతా 8వ పేజీలో

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.
- మురుగు కాల్వలను శుభ్రం చేయించాలి.
- ఖాళీ స్థలాలు, పాత టైర్లు, కుండల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. రోడ్ల వెంట నీరు చేరకుండా గుంతలు పూడ్చేయాలి.
- దోమలు ఇళ్లలోకి చేరకుండా కిటికీలు, తలుపులకు మూసుకోవాలి.
- దోమ తెరల వినియోగం తప్పనిసరి.
- వేడిచేసి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలి.
- జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులాంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

రోడ్డుపైనే పార్కింగ్.. ట్రాఫిక్ తిప్పలు



ముత్తంగిలో హోటల్ ఎదుట హైవేపై వాహనాలు నిలుపడంతో నెమ్మదిగా కదులుతున్న ట్రాఫిక్

రామచంద్రాపురం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ముత్తంగి వద్ద ఓఆర్ఆర్ జంక్షన్ పక్కన హోటళ్ల ఎదుట హైవేపై వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండటతో ఓవైపు రోడ్డును తవ్వేశారు. ఉన్న కాస్త రహదారిపై హోటళ్లకు వచ్చేవారి వాహనాలు నిలుపడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతున్నది. కిలోమీటరు దూరం దాటడానికి అరగంటకు పైగా పడుతున్నది.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. గత నెల 22 నుంచి 28 వరకు పరీక్షలు జరిగిన పరీక్షల ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. సంగారెడ్డి జిల్లాలో ఫస్టియర్ జనరల్ విభాగంలో 9,253 మందికి 5,483 మంది, సెకండియర్ జనరల్ విభాగంలో 4,895 మందికి 2,153 మంది, ఫస్టియర్ వొకేషనల్ విభాగంలో 675 మందికి 432 మంది, సెకండియర్ వొకేషనల్‌లో 396 మందికి 226 మంది ఉత్తీర్ణత సాధించినట్లు సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ అర్బన్, (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఫస్టియర్ జనరల్ విభాగంలో మొత్తం 3,462 మందికి 1,984 మంది, సెకండియర్ జనరల్ విభాగంలో 2,133 మందికి 1,212 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ప్రథమ సంత్సరం 164 మందికి 115 మంది, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం 81 మందికి 62 మంది ఉత్తీర్ణులయ్యారు.

మోడల్ స్కూల్ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

మునిపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మునిపల్లి ఆదర్శ పాఠశాలలో 6, 7, 8 తరగతులకు ఇంగ్లిష్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



ప్రజావాణిలో మహిళతో మాట్లాడి సమస్య తెలుసుకుంటున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య

సంగారెడ్డి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : 'ప్రజావాణి'లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో నమ్మకంతో ప్రజలు ప్రజావాణికి వస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల్లో కొన్ని ముఖ్యమైనవి ఈవిధంగా ఉన్నాయి... అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఫిర్యాదు చేశారు. జహీరాబాద్ మండలం గోప్పన్‌పూర్ గ్రామానికి చెందిన నర్సమ్మ తన భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించి న్యాయం చేయాలని అర్జీ పెట్టుకున్నారు. బీరంగూడ భ్రమరాంబా ఆలయ ఆవరణలో కొందరు అక్రమంగా మట్టి, మొరం, కంకర, రాళ్ల వ్యాపారం చేస్తుండటంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌యాదవ్, కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఆర్డీవో, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. జిల్లాలోని పలు పారిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో గత పదేళ్లలో 110 మంది కార్మికులు మృతిచెందారని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి కలెక్టర్‌ను కోరారు. వీటితో పాటు వివిధ సమస్యలపై 63 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశాలకు
నివేదికలు సిద్ధం చేసుకోండి

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

6లో

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం

పీసీసీ కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

శివ్వంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి ఇల్లు ఇవ్వలేదని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సొంత ఇంటి కల నెరవేరుతుందని పీసీసీ కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపేట రుప్లా పంచాయతీ తండా పరిధిలోని పాండ్యా, పోతిరెడ్డిపల్లి, రూప్లా తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన 6 గ్యారంటీలో భాగంగా పార్టీలకు అతీతంగా ఇల్లు లేని గుడిసెలో నివసిస్తున్న నిజమైన లబ్ధిదారులకు ఇద్దరమ్మ ఇల్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతనైనంత కాలం పనిచేస్తూనే..

ఆరు పదుల వయసులోనూ ఆత్మగౌరవంతో జీవనం

ఆదర్శంగా నిలుస్తున్న వృద్ధులు

గుమ్మడిదల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వయసు 60 దాటినా, ఎవరిపైనా ఆధారపడకుండా, తమ శక్తి మేరకు పనిచేస్తూ జీవన పోరాటం కొనసాగిస్తున్నారు కొందరు వృద్ధులు. సంగారెడ్డి జిల్లాలోని బొంతపల్లి, గుమ్మడిదల రోడ్డుపై చిరు వ్యాపారం చేసుకుంటున్న వృద్ధులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 'చేతనైనంత కాలం పని చేయాలి. వయసు 60 దాటినంత మాత్రాన బాధపడాల్సిన పనేముంది? ఎవరిపైనా ఆధారపడకుండా బతకాలి' అని ఈ వృద్ధులు చెబుతున్నారు. బతుకు విలువను నేర్పుతున్నారు. కష్టేఫలి అన్న సూత్రాన్ని ఆచరణలో చూపిస్తున్నారు.



జీవన పోరాటంలో పెద్దబాపులు

● గుమ్మడిదలకు చెందిన అప్పారావు(62), తన భార్యతో కలిసి వాడవాడలా పల్లీలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. 'బ్రతకాలంటే ఏదో ఒక పని చేసుకోవాలి, అప్పుడే పూట గడుస్తుంది' అని ఆయన అంటున్నారు. రోజుకు రూ.200 మిగులుతుందని, దాంతో భార్యాభర్తలు సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు.

● గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన సదానంద్ 40 ఏళ్లుగా ప్రధాన కూడలి వద్ద చిన్న బండిపై అరటిపండ్లతో పాటు సీజనల్ పండ్లను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎండ, వాన, చలి ఏదైనా తన వ్యాపారాన్ని ఆపలేదు. రోజువారీ ఆదాయంతో పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు చూసుకుంటున్నారు. 'చేసే పని చిన్నదా, పెద్దదా అని చూడకుండా, ప్రతి ఒక్కరూ మంచి పని చేసుకోవాలి' అని ఆయన సూచిస్తున్నారు.


బొంతపల్లిలో బండిపై అరటి పండ్లు అమ్ముకుంటున్న చిరు వ్యాపారి సదానంద్



స్వశక్తితో బతుకుతున్న పెద్దమ్మలు

● గుమ్మడిదల గ్రామానికి చెందిన గంగుల విట్టమ్మ (64) పదేళ్లుగా రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. భర్త చనిపోయినా అధైర్యపడకుండా, ఒంటరిగా ఉంటూ స్వశక్తితో బతుకుతున్నారు. రోజుకు రూ. 300 నుంచి 400 వరకు ఆదాయం వస్తుందని, వచ్చిన దాంట్లోనే తృప్తిగా బతుకుతున్నామని తెలిపారు. 'పనిచేయకుండానే డబ్బులు రావాలని ఆశపడుతూ అడ్డదారులు తొక్కుతున్న యువతను చూస్తే బాధ అనిపిస్తుంది' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

● గుమ్మడిదలలో నివాసముంటున్న యశోద (61), తన భర్తతో కలిసి వివిధ రకాల కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం గడుపుతున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నా, చిరు వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయంతోనే వారి పెళ్లిళ్లు చేశారు. సొంత ఇల్లు, భూములు లేకపోయినా, తమ కాళ్ల మీద తాము నిలబడి జీవితాన్ని సాగిస్తున్నారు. రోజుకు రూ.300 వరకు ఆదాయం పొందుతున్నామని, చిన్నచిన్న సమస్యలకే ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని ఆమె సూచిస్తున్నారు.



సమీక్షా సమావేశాలకు నివేదికలు సిద్ధం చేసుకోండి

● అధికారులు పూర్తి సమాచారంతో అందుబాటులో ఉండాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

సంగారెడ్డి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శాఖల వారీగా నిర్వహించే సమీక్ష సమావేశాలకు అధికారులు పూర్తి సమాచారంతో నివేదికలు సిద్ధం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తన వద్దకు వచ్చే ప్రతీ ఫైల్‌కు పూర్తి వివరాలు జత చేయాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నారు. తాను ఫోన్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయా శాఖల్లో ఉన్న పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. త్వరలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నామని, ఆ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు. జిల్లాలో పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయా ప్రాంతాలకు సంబంధించిన పూర్తి సమాచారం వెంట అందుబాటులో ఉంచుకోవాలని, ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజా రాణి, జిల్లా యువజన, క్రీడా శాఖాధికారి ఖాసీం బేగ్, ఇతర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలు..

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతి ప్రవేశాలకు బాలబాలికల ఎంపిక ప్రక్రియ జరుగనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం ఆమె స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం వివరాలను వెల్లడించారు. హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో బాలబాలికలకు 20 చొప్పున మొత్తం 120 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 19 వరకు మండల స్థాయి ఎంపికల షెడ్యూల్ జరుగుతుందని, ఆ తర్వాత జిల్లా స్థాయి ఎంపికలు జూన్ 25, 26 తేదీల్లో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభమవుతాయని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పూర్తి సమాచారం కోసం 7981798957 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

'ప్రజావాణి'పై నిర్లక్ష్యం వద్దు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు హాజరయ్యారు. కలెక్టర్ ప్రజల నుంచి మొత్తం 85 వినతులు స్వీకరించారు, ఇందులో 36 భూ సమస్యలు, 17 ఇందిరమ్మ ఇళ్లు, 2 పింఛన్లు, 17 ఇతర సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, అలాగే మండల స్థాయిలో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇదేవిధంగా, పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఎస్పీ, బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.


అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

మెదక్‌లో పీఎం ధర్తీ ఆబాజన్ భాగీదారి అభియాన్

మెదక్ జిల్లాలోని 10 మండలాలు, 15 గిరిజన గ్రామాలు, 17 హ్యాబిటేషన్లలో పీఎం ధర్తీ ఆబాజన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధార్, రేషన్ కార్డు, కుల సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డు, ఆయుష్మాన్ భవ ఇన్సూరెన్స్ వంటి సేవల కోసం వినతులు స్వీకరించనున్నామని తెలిపారు. అధికారులు సమన్వయంతో ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.

కామ్రేడ్ కిష్టన్న.. బాగున్నారా?

● వయోవృద్ధ సీపీఐ కార్యకర్తను ఆప్యాయంగా పలకరించిన మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : 'ఏం కిష్టన్న... బాగున్నారా... ఆరోగ్యం కులాసాగా ఉందా... ఉద్యమాలు కొనసాగిస్తున్నారా... ఏంటి సమస్య?' అంటూ మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, సీపీఐ సీనియర్ కార్యకర్త, వయోవృద్ధులు కామ్రేడ్ మరాఠీ కిష్టయ్యను ఆప్యాయంగా పలకరించారు. సోమవారం ప్రజావాణి హాలులో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన కిష్టయ్యను చూసి గుర్తించిన నగేష్, ఆయన బాగోగులు కనుక్కున్నారు. వీలు చేసుకుని భోజనానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. గతంలో మెదక్ ఆర్డీవోగా పనిచేసిన నగేష్‌కు, పీడిత ప్రజల తరఫున మెమొరాండాలు ఇవ్వడానికి కిష్టయ్య తరచుగా కార్యాలయానికి వచ్చేవారు. ప్రస్తుతం 90 ఏళ్లపైబడిన వయసులోనూ పలువురి తరఫున ఫిర్యాదులు ఇవ్వడానికి కిష్టయ్య స్వయంగా ప్రజావాణికి వచ్చారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

చేగుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలోని పులిమామిడి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి చెందిన గుండెల్లి చంద్రయ్య (50) తన కొడుకు పరుశరాములుతో కలిసి రామాయంపేట మండలం ధర్మారంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి బైక్‌పై తిరిగి స్వగ్రామం కాసులాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఢీకొనడంతో చంద్రయ్య తల పగిలి అక్కడికక్కడే మృతి చెందారు. కొడుకు పరుశరాములు కుడి కాలికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.


చంద్రయ్య (ఫైల్)

తిమ్మాపూర్ శివారు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

దుబ్బాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం, అక్బర్‌పేట - భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన పల్లె అనిల్ (27), అదే గ్రామానికి చెందిన ఉచ్చురి పాపయ్య (30) బైక్‌పై సిద్దిపేటకు వెళ్తుండగా, సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు వారి బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో పల్లె అనిల్ అక్కడికక్కడే మృతి చెందారు. గాయాలైన పాపయ్యను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పాపయ్య సోమవారం ఉదయం మరణించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్ఐ గంగరాజు .

తల్లిగారింటికి వెళ్తానన్న వివాహిత అదృశ్యం

● నర్సాపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదు

నర్సాపూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తన తల్లిగారింటికి వెళ్తానని భర్తకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంగటన నర్సాపూర్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుస్తుంపేటకు చెందిన పద్మకు ఆరేళ్ల క్రితం నర్సాపూర్‌కు చెందిన ఖాజీపల్లి నర్సింలుతో వివాహం జరిగింది. వారికి పిల్లలు లేరు. పద్మ ఈ నెల 15వ తేదీ ఆదివారం తన తల్లిగారి ఇంటికి రుస్తుంపేటకు వెళ్తానని భర్తకు చెప్పి వెళ్లింది. అయితే, సాయంత్రం తల్లిగారింటికి వెళ్లిన భార్యకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. రుస్తుంపేటలోని బావమరిదికి ఫోన్ చేయగా తమ వద్దకు రాలేదని సమాధానమిచ్చారు. నర్సాపూర్‌తో పాటు బంధువుల వద్ద, ఇతర చోట్ల ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో, సోమవారం నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రభుత్వ వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే విచారణలు

● నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ అగ్ర నాయకులపై విచారణ పేరిట కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో సోమవారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విచారణ సందర్భంగా, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి కేటీఆర్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీలు జంగం శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్‌చారి, నగేష్, మశ్చందర్, గీతారెడ్డి, మాధవరెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు నడపాలి

● నర్సాపూర్ బస్టాండ్ వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల ధర్నా



నర్సాపూర్‌లో బస్టాండు వద్ద బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

నర్సాపూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కపల్లిలో ఉన్న మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం నర్సాపూర్ బస్టాండు ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. పాఠశాలలు ప్రారంభమైనా ఆర్టీసీ అధికారులు మాత్రం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌కు గతంలో రోజు మూడు బస్సులు నడిపేవారని, ఈసారి నడపడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు లేకపోవడంతో స్కూల్‌కు వెళ్లడానికి పడరాని పాట్లు పడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోయారు. పోలీసులు అక్కడకు వచ్చి నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా ఎంతకు విరమించకపోవడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులను ఈ నెల 20 నుంచి నడుపుతామని డిపో అధికారులు తెలిపగా, వెంటనే ప్రారంభించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. చివరకు ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

● ప్రజా సంఘాల డిమాండ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పౌర హక్కుల, ప్రజాసంఘాల నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, అమాయక ఆదివాసీలను అణచివేసే యుద్ధాన్ని ఆపి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని జిల్లా పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జూన్ 17న హైదరాబాద్‌లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సిద్దిపేటలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు రాగుల భూపతి మాట్లాడుతూ దండకారణ్య ప్రాంతంలో స్థానిక సాయిధ పోలీసులతో పాటు కేంద్ర పారామిలిటరీ సాయిధ బలగాలతో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించి యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారని, అమాయక ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీల మీద, మావోయిస్టు పార్టీ నాయకుల మీద జరిగే దాడులను ఆపి, ఆపరేషన్ కగార్ పేరుతో జరిగే కాల్పులను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజా ఫ్రంట్ నాయకులు జి. సత్తయ్య, దారం మల్లారెడ్డి, దుర్గం రాములు, సి.హెచ్. నరసింహులు, మధుసూదనరెడ్డి, టి. మల్లేశ, నర్సింలు, పి. శ్రీధర్, నర్సింలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జ్యోతిషుడు రాజేశ్వర్‌రెడ్డికి దైవజ్ఞ రత్న బిరుదు

● స్వర్ణ కంకణం ప్రదానం



రాజేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న విశ్వజ్యోతి సంస్థ సభ్యులు

సిద్దిపేట క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిషుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం సాయంత్రం విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ నిర్వహించిన 17వ జ్యోతిష సమ్మేళనంలో ఆయనకు దైవజ్ఞ రత్న బిరుదుతో పాటు స్వర్ణ కంకణం ప్రదానం చేశారు. ముహూర్తం, లగ్న, భావ, నవాంశ ఫలితాలపై, అలాగే బృహత్సంహితపై జరిగిన సెమినార్‌లో ప్రతిభావంతులను గుర్తించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, బహుగ్రంథకర్త పుచ్చా శ్రీనివాసరావు, పరిశోధకులు పాలకుర్తి శ్రీకాంత్ శర్మ, ఇంద్రగంటి వెంకట గోపాల కృష్ణ శర్మ, కంచి కామకోటి పీఠం ఆస్థాన సిద్ధాంతి లక్కావఝుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి, విశ్రాంత ఇస్రో డైరెక్టర్ డా. రావు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక

● రెండోసారి ఎన్నికైన తూప్రాన్ అల్లాపూర్ వాసి



రాష్ట్ర అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న బాలకృష్ణ ప్రజాపతి

తూప్రాన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని అల్లాపూర్‌కు చెందిన కుమ్మరి బాలకృష్ణ ప్రజాపతి తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్నికల్లో బాలకృష్ణ రెండోసారి ఈ పదవికి ఎంపికయ్యారు. రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు కానుగుల నర్సింలు ప్రజాపతి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కుమ్మరుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

160 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

బెజ్జంకి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముగ్గురిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 160 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. సిదిపేట టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్ సోమవారం కేసు వివరాలను వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు మండల కేంద్రంలోని ఎడ్లబండి చౌరస్తా వద్ద ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వేశారు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సర్వాయిపేటకు చెందిన దుర్గం శేఖర్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నాలుగు కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. శేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు బెజ్జంకి శివారులోని పాడుబడిన ప్రభుత్వ పట్టుపురుగుల కేంద్రం వద్ద తనిఖీలు చేపట్టగా, నాలుగు బస్తాల్లో 160 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. ఈ కేసులో దుర్గం శేఖర్ సహా, కడప జిల్లా మైదుకురుకు చెందిన వసంతరాంరెడ్డి, నంద్యాల జిల్లా కొండపల్లికి చెందిన కుందవరం ప్రభాకర్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు. మండల వ్యవసాయాధికారి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆయన వెంట సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, జానకీరాం రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, బెజ్జంకి ఎస్సై తిరుపతి రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.





మెదక్ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

నిఘాపై నిర్లక్ష్యం

● మెదక్ ఆర్టీసీ బస్టాండుల్లో భద్రత కరువు
● నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీ
● సీసీ కెమెరాలు లేకపోవటంపై సర్వత్రా విమర్శలు

మెదక్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే మెదక్ ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా కరువైంది. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించినా, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. దినదినాభివృద్ధి చెందుతున్న మెదక్‌లో పోలీసులు రద్దీగా ఉండే ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా, జిల్లా కేంద్రంలోని అన్ని ప్రాంతాల కన్నా ఎక్కువగా రద్దీ ఉండే ఆర్టీసీ బస్టాండ్‌లో మాత్రం ఇప్పటి వరకు ఒక్క సీసీ కెమెరా కూడా బిగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భద్రత లోపం

ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు, విద్యార్థులు వచ్చే ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల భద్రత లోపించింది. వేలాది మందితో కిటకిటలాడే బస్టాండ్‌లో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే పోలీసులకు డిపో ఆవరణ నుంచి ఎలాంటి ఆధారాలు దొరకని పరిస్థితి నెలకొంది. సెక్యూరిటీ గార్డులు కేవలం బస్‌డిపో వరకు మాత్రమే తమ విధులు నిర్వహిస్తుండగా, ప్రాంగణంలోకి ఎవరు వస్తున్నారు, ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయో పట్టించుకోవడం లేదు. కొత్తగా పట్టణంలోకి వచ్చే వారిపై నిఘా పెట్టాల్సిన కీలక ప్రాంతంలో కెమెరాలు లేకపోవడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెదక్ డిపో వివరాలు

మెదక్ డిపో పరిధిలో మొత్తం 108 బస్సులు (ఆర్టీసీ 53, అద్దె బస్సులు 55) ఉన్నాయి. నిత్యం 30 వేల కిలో మీటర్ల ప్రయాణం చేస్తూ..60 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతోంది. వీటి ద్వారా రూ. 20 లక్షల ఆదాయం సంస్థకు సమకూరుతోంది. ఇందులో 60 వేల మంది ప్రయాణికుల్లో 44 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తుండటం గమనార్హం. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటును విస్మరించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి



రోజూ వేలాది మంది రాకపోకలు కొనసాగించే బస్టాండులో సీసీ కెమెరాలు లేకుంటే ఎట్లా? చిన్నచిన్న దుకాణాల్లో సైతం ఈ కాలంలో కెమెరాలు పెట్టుకుంటున్నారు. అపహరణలు, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా సీసీలు ఫుటేజీలు నేడు ఉపయుక్తంగా ఉంటాయి. రద్దీగా ఉండే బస్టాండులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

- సుంకరి లింగం, ప్రయాణికుడు

సీసీ కెమెరాల ఏర్పాటు.. సంస్థ నిబంధనల్లో ఉండదు



ఆర్టీసీ బస్టాండులో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రొవిజన్ ఉండదు. ఎక్కడా కూడా సంస్థ సీసీ కెమెరాలను సంస్థ ఏర్పాటు చేయలేదు. వీటిని ఏర్పాటు చేయాలని పట్టణ పోలీసులకు తెలిపాం. ఎవరైన దాతలు ముందుకు వచ్చినా, అందుకు ముందుగా ఉన్నతాధికారుల అనుమతి పొందాల్సి ఉంటుంది.

- సురేఖ, డీఎం మెదక్

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

బస్సులో బ్యాగ్ మరచిపోయిన ప్రయాణికుడు

భద్రంగా అప్పగింత.. అభినందించిన హుస్నాబాద్ డీఎం

హుస్నాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బస్సులో బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికుడికి బ్యాగ్‌ను అందజేసి హుస్నాబాద్ డిపో ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. సోమవారం హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హుజురాబాద్ నుంచి హుస్నాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యలో కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో విజయ్ అనే ప్రయాణికుడు బ్యాగ్‌తో బస్సు ఎక్కాడు. ఆయన సెల్‌ఫోన్ మాట్లాడుతూ సుందరగిరిలో బస్సు దిగాడు. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్‌ను మరిచిపోయినట్లు గుర్తించిన ప్రయాణికుడు విజయ్ వెంటనే బస్టాండ్ కంట్రోలర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. కంట్రోలర్ వెంటనే సదరు బస్సు కండక్టర్‌ను అప్రమత్తం చేశారు. బస్‌లో ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని డిపో మేనేజర్‌కు వెంకన్నకు అందజేశారు. బ్యాగులో మొబైల్ ఫోన్, మూడు తులాల బంగారం నగలు, దుస్తులున్నాయి. బ్యాగ్‌ను ప్రయాణికుడు విజయ్‌కు అప్పగించడంతో ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఆర్టీసీ సిబ్బందికి, డిపో మేనేజర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గతంలోనూ తాను నిర్మల్ బస్సులో సెల్‌ఫోన్ మరచిపోతే జగిత్యాల డిపోలో తిరిగి అందజేశారని విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నాడు. ప్రయాణికుడికి సురక్షితంగా బ్యాగ్ అందించడంలో కండక్టర్ సాగర్, డ్రైవర్ ఆంజనేయులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ మురళి, కంట్రోలర్‌ను డిపో మేనేజర్ అభినందించారు.



ప్రయాణికుడికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న ఆర్టీసీ డీఎం, సిబ్బంది

బీసీని సీఎం చేసే దమ్ము కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఉందా?

ముదిరాజ్‌లు రాజకీయంగా చైతన్యం కావాలి

ఐక్యతతో అభివృద్ధి సాధించాలి : మెదక్ ఎంపీ రఘునందన్

సిద్దిపేట అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీసీలను ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించే ధైర్యం ఉందా అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. బీజేపీ చెప్పిన హామీలను నెరవేరుస్తుందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని ముదిరాజ్ హాస్టల్ భవనం ప్రహరీ నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిన ఆయన, సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీకి అవకాశం వస్తే బీసీ బిడ్డను మూడుసార్లు దేశ ప్రధానిగా చేశామని, రాష్ట్రపతిగా మహిళను చేశామని గుర్తుచేశారు. ముదిరాజులు ఐక్యంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా చైతన్యం కావాలని సూచించారు. అందరూ ఆశీర్వదిస్తేనే మెదక్ ఎంపీగా గెలుపొందానని తప్పకుండా ఇక్కడి ప్రజలకు తన వంతుగా సహకరిస్తానని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలో నాలుగు మండలాలకు ముదిరాజ్ కులస్థులనే అధ్యక్షులుగా ఎన్నుకున్నామని, బీజేపీ ముదిరాజులకు సముచిత స్థానం ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కూడా ముదిరాజ్‌నే నియమించుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, ముదిరాజ్ పెద్దలు బాల్ రంగం, బీజేపీ నాయకులు బాసం గారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పోస్టాఫీసు ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. సోమవారం మిరుదొడ్డిలో సబ్ పోస్టాఫీసును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రజాప్రతినిధులు పనిచేయాలని, తాను అదే లక్ష్యంతో పని చేస్తున్నానని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన తొలినాళ్లలోనే మిరుదొడ్డిలో డబుల్ రోడ్డుతోపాటు, గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించామని గుర్తుచేశారు. అదేవిధంగా, మండలంలో రూ. 5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న రెడ్డి సంఘం రీడింగ్ రూమ్ నిర్మాణానికి రఘునందన్‌రావు శంకుస్థాపన చేశారు. ఎస్సీ కమ్యూనిటీ భవనానికి అదనంగా రూ.5 లక్షల రూపాయలు కేటాయించి, పెండింగ్ పనులకు కొబ్బరికాయ కొట్టారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యుడు ప్రవీణ్, టెలికాం బోర్డు సభ్యుడు మల్లేశం, బీజేపీ మండల అధ్యక్షుడు అమర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ

భూసేకరణ పరిహారంపై అసైన్డ్ రైతుల ఆందోళన

● ఘనపూర్‌లో రెవెన్యూ సదస్సు వద్ద బైఠాయింపు
● రెండు నెలల్లో పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ

తూప్రాన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ పరిహారం చెల్లింపులో పక్షపాతం వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ తూప్రాన్ మండలం ఘనపూర్ రెవెన్యూ సదస్సు వద్ద సోమవారం అసైన్డ్ రైతులు ఆందోళన చేపట్టారు. రెవెన్యూ సదస్సు ప్రారంభం కాగానే సర్వే నంబర్ 393, 441లో అసైన్డ్ పట్టాలు పొందిన మహిళా రైతులు అక్కడకు చేరుకున్నారు. పరిశ్రమల స్థాపన కోసం టీజీఐఐసీ ఈ భూములను సేకరిస్తున్నందున, తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారం చెల్లింపు విషయంలో వివక్ష చూపిస్తున్నారని ఆరోపిస్తూ రెవెన్యూ సదస్సు వద్ద రోడ్డుపై బైఠాయించి భూపంపిణీ సర్టిఫికెట్లు పట్టుకొని నిరసన తెలిపారు. ఆందోళనతో సదస్సులో గందరగోళం నెలకొంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం, తహసీల్దార్ టెక్మాల్ శ్రీనివాస్ రైతులను సముదాయించారు. అనంతరం రైతులు ఆర్డీవో జయచంద్రారెడ్డి వద్దకు వెళ్లి సమస్యను విన్నవించారు. భూములకు పరిహారం చెల్లింపు విషయాన్ని రెండు నెలల్లో పరిష్కరిస్తానని ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు.



ఘనపూర్ రెవెన్యూ సదస్సు వద్ద అసైన్డ్‌దారుల ఆందోళన

ఆటాడుకునేదెలా?

రాళ్లు, రప్పలతో నర్సాపూర్ జూనియర్ కళాశాల మైదానం

మినీ స్టేడియం నిర్మాణం హామీ ఏమైంది?



అధ్వానంగా మారిన జూనియర్ కాలేజీ మైదానం

నర్సాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో నర్సాపూర్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించిన ఘనత ఉన్నది. కానీ ప్రస్తుతం ఇక్కడి వారికి కనీసం ఆడుకోవడానికి కూడా మైదానం దిక్కులేదు. దీంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. మినీ స్టేడియం నిర్మిస్తామని ఎన్నికల సమయం వచ్చినపుడల్లా హామీలు ఇవ్వడమే తప్పా సంవత్సరాలు గడుస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో జూనియర్ కాలేజీకి చెందిన మైదానమే ఇక్కడి వారికి ఆడుకోవడానికి దిక్కుగా మారింది. అది కూడా ఎవరు పట్టించుకోక అధ్వానంగా తయారైంది.

నిర్వహణలేక

ఈ మైదానంలోనే గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను కూడా నిర్వహించారు. వీటితో పాటు తరచూ క్రికెట్, షటిల్ తదితర పోటీలు కూడా కొనసాగుతాయి. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఈ మైదానాన్ని నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో మైదానం అంతా ఎత్తుపల్లాలతో పాటు రాళ్లు రప్పలతో అత్యంత దారుణంగా మారింది. ఉన్న ఒక్క ఈ మైదానాన్ని క్రీడలకు అనువుగా తీర్చిదిద్దుదామన్న ఆలోచన ఇక్కడి నాయకులకు, అధికారులకు రావడం లేదని క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా ప్రయోజనం లేదు

ఉమ్మడి రాష్ట్రంలో జూనియర్ కాలేజీ మైదానంలోనే మినీస్టేడియం నిర్మిస్తామని అప్పట్లో నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. తర్వాత ఈ మైదానం మినీస్టేడియానికి స్థలం సరిపోదని మరోచోట ప్రత్యేకంగా కేటాయించి నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అయితే, నర్సాపూర్‌లో స్థలం కేటాయిస్తే మినీస్టేడియం నిర్మాణానికి రూ.2కోట్లు గత ప్రభుత్వంలో మంజూరు కూడా అయ్యాయి. స్థలం కోసం నర్సాపూర్-మెదక్ రోడ్డు సమీపంలో పరిశీలించి, మళ్లీ దాని ఊసే ఎత్తలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు మినీస్టేడియం నిర్మించాలని క్రీడాకారుల, క్రీడాభిమానులు కోరుకుంటున్నారు.

న్యూస్ బాక్స్

ఇక ప్రభుత్వాసుపత్రికి.. 24 గంటలు కరెంటు సరఫరా

రామాయంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) ఇక రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి 24 గంటల కరెంటు సరఫరా అవుతుంది. ఇందు కోసం నేరుగా సబ్ స్టేషన్ నుంచి కేబుల్ లైన్ వేస్తున్నారు. రెండు రోజులుగా ఈ పనులు చేపట్టగా.. తమ ఇళ్ల ముందు నుంచి లైన్లు తీసుకవెళ్లద్దంటూ పలువురు పనులను ఆపి గొడవ చేశారు. అంతే కాదు స్తంభాలు వేసే క్రమంలో ఎక్స్‌కవేటర్ కీస్ లాక్కోవడంతో సోమవారం ఎస్ఐ బాలరాజు, కాంగ్రెస్ నాయకులు సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి చేరుకొని సముదాయించారు. ఎట్టకేలకు సమస్య క్లియర్ అవటంతో కేబుల్ లైన్‌ల పనులు మొదలయ్యాయి.

నేడు విద్యుత్ అంతరాయం

రామాయంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రామాయంపేటలోని రాజేంద్రనగర్ కాలనీలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నది. విద్యుత్తు లైన్ల మరమ్మత్తుల నేపథ్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదు. వేలాడుతున్న వైర్లను సరి చేసే క్రమంలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

19 నుంచి క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

పాపన్నపేట జూన్ 16(ఆంధ్రజ్యోతి) తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో నాలుగవ తరగతిలో చేరడానికి ఈనెల 19 నుంచి 25 వరకు మండల స్థాయి ఎంపిక కొనసాగుతుందని మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డివెల్లడించారు. మండల స్థాయి ఎంపిక ఈనెల 19 నుంచి పాపన్నపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామని 8 నుంచి 9 సంవత్సరాల వయసు గలవారు ఈ పాఠశాలల్లో చేరడానికి అర్హులని ఆయన వెల్లడించారు. మిగతా వివరాలకు మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, 85002 00859, ఫిజికల్ డైరెక్టర్ రమేష్ ఫోన్9010735121 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా వారు సూచించారు.

మంత్రులను కలిసిన నాయకులు

సంగారెడ్డి రూరల్/ రామాయంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన కార్మిక, మైనింగ్ శాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్‌లో సోమవారం సంగారెడ్డికి చెందిన అంబేద్కర్ సేవాసమితి నాయకులు కలిసి సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు జగన్, రామారావు, సదానందం, జగదీశ్వర్, హనుమంతు, మురహరి, శేఖర్, యాదగిరి, సురేష్, పోతురాజు, ప్రభాకర్, అశోక్, తరుణ్ తదతరులు ఉన్నారు. అదేవిధంగా మంత్రి వివేక్‌ను మాల మహానాడు మెదక్ జిల్లా కమిటీ సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి మంత్రిని సన్మానించారు.

●**వట్‌పల్లి:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సంగమేశ్వర్ సోమవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మాని సత్కరించారు.

కొండాపూర్ 'రైతు నేస్తం'లో కలెక్టర్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి




టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్,కలెక్టర్ ప్రావీణ్య, రైతునేస్తంలో కలెక్టర్‌తో కలిసి పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

కొండాపూర్,జూన్ 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు, ఆధునిక పద్ధతుల్లో సాగు విధానాల గురించి రైతులకు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ రైతు వేదికలో కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలు రైతులు పాటించాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగు పద్ధతి, మెలకువలు, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ చేపట్టి రైతన్నలు అధిక దిగుబడులు పొందాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, జిల్లావ్యవసాయాధికారి శివప్రసాద్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం'లో రైతులు.. అధికారులు



చౌటకూర్ రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని వింటున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని రైతు వేదికల్లో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించి రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలోని మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తా, చౌటకూర్ మండలకేంద్రం, వట్‌పల్లి మండలంలోని వట్‌పల్లి, దేవునూర్, మర్వెల్లి, కాదిరాబాద్, గుమ్మడిదల మండలంలోని కానుకుంట, నాగల్‌గిద్ద మండలంలోని కరస్‌గుత్తి, జహీరాబాద్ మండలంలోని రంజోల్, కొత్తూర్(బి) తదితర ప్రాంతాల్లోని రైతువేదికల్లో రైతు నేస్తం వీడికాన్ఫరెన్స్ నిర్వహించారు. చౌటకూర్ మండలకేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి వినయ్,ఉద్యానవన శాఖాధికారి ప్రతాప్ సింగ్,మండల వ్యవసాయ అధికారి నాగమాధురి, విస్తరణ అధికారులు పాల్గొన్నారు నర్సాపూర్‌లో రైతు వేదికలో రైతులతో పాటు అదనపుకలెక్టర్ నగేష్ వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని మడూర్, తూప్రాన్, గుండ్రెడ్డిపల్లి, వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్, చేగుంట తదితర ప్రాంతాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లాస్థాయి అధికారులతో పాటు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



నర్సాపూర్ రైతు వేదికలో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

● పలు మండలాల్లో రెవెన్యూ సదస్సులు



కందిలో భూభారతి సదస్సులో దరఖాస్తులను రెవిన్యూ అధికారులకు అందజేస్తున్న రైతులు



నర్సాపూర్ మండలం ఖాజీపేటలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో మహిపాల్

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో సోమవారం భూభారతి సదస్సులను ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు భూమస్యలకు సంబంధించిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు అందజేశారు. భూసమస్యల పరిష్కారానికే భూభారతి సదస్సులు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. సంగారెడ్డి మండలంలోని కంది, జిన్నారం, జహీరాబాద్ మండలాల్లో సదస్సులు నిర్వహించారు. జిన్నారం మండలంలో మొత్తం 753 దరఖాస్తులు, జహీరాబాద్ మండలంలో450కి పైగా చిలుకు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా నర్సాపూర్ మండలం ఖాజీపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీవో మహిపాల్ హాజరై రైతుల సమస్యలను తెలుసుకున్నారు. పాపన్నపేట మండలంలోని కొత్తపల్లిలో మెదక్ ఆర్డీవో రమాదేవి పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. మనోహరాబాద్ మండలంలోని అగ్రహారం, చిన్నశంకరంపేట, రేగోడు మండలంలోని కొత్వాల్‌పల్లి తదితర గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సంబంధిత తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చేరికలు పెరగకుంటే ఉపాధ్యాయులకు సమస్యలే



తూప్రాన్ జరిగిన బడిబాటలో ప్రసంగిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమురయ్య

తూప్రాన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ (చేరికలు) పెంచకపోతే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సమస్యలు వస్తాయని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట క్విజ్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొని ప్రసంగించారు. పాఠశాల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడంతోపాటు, డ్రాపవుట్ కాకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో, తూప్రాన్‌లో ఎస్ఎస్‌సీలో ర్యాంకులు తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి క్రీడలు, సబ్జెక్టులపై పోకస్ పెట్టాలని కొమురయ్య తెలిపారు. విద్యార్థులను మంచి ప్రయోజకులుగా ఉపాధ్యాయులు తయారు చేయాలన్నారు. జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్, ఎంఈఓ డాక్టర్ పర్వతి సత్యనారాయణ, తపస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచండి

మునిపల్లి, జూన్16 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను బడిలో చేర్పించి సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సీఎంవో అధికారి వెంకటేశం ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం బడిబాట కార్యక్రమాన్ని సందర్శించి నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి



పాఠశాల గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

జిన్నారం, జూన్, 16 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజక వర్గంలో ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుతో యువతకు ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిన్నారం మండలం శివానగర్ ప్రభుత్వ పాఠశాలలో న్యూలాండ్ ఫౌండేషన్ 50 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జవహర్ నవోదయ పాఠశాల, ఐటీఐల ఏర్పాటు జరుతుందని తెలిపారు. అదే విధంగా కేంద్రప్రభుత్వ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు కృషి చేస్తున్నామని వెల్లండించారు. కాగా న్యూలాండ్ సంస్థ విద్యా రంగ అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులను కేటాయించటం పట్ల వారు అభినందించారు. కాగా రెండు అంతస్థుల్లో కోటి వ్యయంతో మరో రెండు గదులు నిర్మించేందుకు కూడా యాజమాన్యం అంగీకరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, పరిశ్రమ ప్రతినిధులు డీపీ రెడ్డి, సీహెచ్ రవి, యాదగిరి, మధుబాబు, హర్ష, ఎంఈవో కుమారస్వామి, హెచ్ఎం సంధ్యారాణి, నాయకులు మహేష్, కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ 'యోగ' పై అవగాహన ర్యాలీ

రామాయంపేట,జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆయుష్ 'యోగ పై అవగాహన ర్యాలీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు సోమవారం మండల పరిధి తొనిగండ్లలో ర్యాలీ చేపట్టారు. యోగ శిక్షకులు మద్దెల భరత్ నేతృత్వంలో గ్రామ పంచాయతీ నుంచి పలు వీధుల్లో తిరిగారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక,తాజా మాజీ ఎంపీటీసీ నాగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అయ్యమ్మ చెరువులో ఫెన్సింగ్ తొలగించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గడ్డపోతారం మత్స్యకారులు

జిన్నారం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం అయ్యమ్మ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఓ పరిశ్రమ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తొలగించాలని మత్స్యకారులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం గడ్డపోతారానికి చెందిన మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు 36ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అయ్యమ్మ చెరువుకు 60 ఎకరాల వరకు ఎఫ్‌టీఎల్ పరిధి ఉండగా.. స్థానిక పరిశ్రమ ఆ భూమి నుంచి ఫెన్సింగ్ వేసి రాతి కడీలను ఏర్పాటు చేశారని, దీంతో చెరువులో చేపల వేట కోసం వేసే వలలు చిరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. వెంటనే ఫెన్సింగ్ తొలగించాలని, ఇటీవల చెరువు తూమును ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కంకోల్ వసతి గృహం తనిఖీ

మునిపల్లి, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకోల్ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహాన్ని సోమవారం సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పరిసరాలు, వంటగదిని పరిశీలించి భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని వార్డెన్ పవన్ కుమార్‌కు సూచించారు.

మంత్రులను సన్మానించిన ఎమ్మెల్యే



మంత్రి శ్రీహరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌లను స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం హైదరాబాద్ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వారిని శాలువాలతో సన్మానించారు. పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వట్‌పల్లి మార్కెట్ ఫీజు రూ 97.43 లక్షలు వసూలు

వట్ పల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ 2024-25 సంవత్సరానికి రూ97.43 లక్షలు మార్కెట్ ఫీజు వసూలు చేసినట్లు తెలిపారు. వట్‌పల్లి ఏఎంసీ కార్యాలయంలో సోమవారం సభ్యులతో సమావేశం నిర్వహించారు.

కర్రలే ఊతం.. ప్రాణాలు గాల్లో దీపం

(5వ పేజీ తరువాయి)

తీగలు కిందకు వేలాడుతున్నాయి.

భయం భయంగా..

గడిచిన ఏడాది విద్యుత్ షాక్ కారణంగా మెదక్ జిల్లాలో 10 మంది, సంగారెడ్డి జిల్లాలో 14 మంది చనిపోయారు. ఇక రెండు జిల్లాల్లో దాదాపు 71 పశువులు మృత్యువాతపడ్డాయి. క్రితం ఏడాది కూడా ప్రమాదాల సంఖ్య ఎక్కువగానే ఉంది. కాగా ప్రమాదాలు జరుగుతున్నా దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. పెరుగుతున్న సాంకేతికతతో విద్యుత్ ప్రమాదాలకు అడ్డుకట్ట పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ జిల్లాలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. దీనికి స్వీయ తప్పిదాలతోపాటు విద్యుత్‌శాఖ లోటుపాట్లు కూడా లేకపోలేదు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అధికారులు సరైన పర్యవేక్షణ కేంద్రీకరించడం లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత లేకపోలేదు.

వానాకాలం.. వ్యాధుల ముప్పు

(5వ పేజీ తరువాయి)

ప్రజలు జ్వరాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

నామమాత్రపు చర్యలు

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా పీహెచ్‌సీల డాక్టర్లు, వైద్య సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్ల ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగత్తలు వివరించాల్సి ఉన్నా ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. డెంగీ లేదా టైఫాయిడ్ కేసు నమోదైతే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం అక్కడికి చేరుకుని నామమాత్రంగా నియంత్రణ చర్యలు చేపడుతుందనే విమర్శలున్నాయి.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం/సిర్గాపూర్/కల్హేర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలకు సంగారెడ్డి ఎస్పీపరితోష్ పంకజ్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎస్పీ పంకజ్ కోరారు. సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల పనితీరు, కేసుల నమోదు, పరిష్కారం తదితర వాటిని స్థానిక ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వెంట నారాయనఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సిఐలు జంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/రేగోడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రేగోడు మండలాల్లోని పోలీస్‌స్టేషన్‌లను సోమవారం ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎస్పీ వెంట అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్‌రెడ్డి, పోచయ్య, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన నీలం మధు



మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నూతన మంత్రిగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా హైదరాబాద్ ఆరామ్‌గర్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. నీలం మధుని మంత్రి ఆత్మీయ ఆలింగనం చేసుకుని శాలువాలతో సత్కరించుకున్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన తోపాజి అనంత కిషన్



టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో తోపాజి అనంతకిషన్

సంగారెడ్డి రూరల్/ పటాన్‌చెరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన తోపాజి అనంతకిషన్ సోమవారం హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తనకు పీసీసీ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు తోపాజి అనంతకిషన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీని బలోపేతం చేయాలని సూచించినట్టు తోపాజి అనంతకిషన్ తెలిపారు. ఆయన వెంట సుధాకర్, గంగేరి శ్రీహరి తదితరులు ఉన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడిగా పదవీబాధ్యతలు చేపట్టిన పటాన్‌చెరుకు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి చిన్నాముదిరాజ్ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖా మంత్రి దామోదర్‌ను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

● బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

పటాన్‌చెరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగపరచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. సోమవారం పాశమైలారం గ్రామంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమం 'మాకి నామ్ పే ఏక్ పేడ్' కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ, మల్లికార్జున ఆలయం వద్ద మొక్కలు నాటారు. అనంతరం డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు రేషన్ బియ్యం, హెల్త్ కార్డుల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవేందర్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వన్ నేషన్... వన్ ఎలక్షన్'తో అభివృద్ధి

వెల్దుర్తి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌తో దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ మల్లేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బస్వాపూర్ లో వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణ ఖర్చు తగ్గుతుందని, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు బాలకిషన్, వెల్దుర్తి మాజీ ఉపసర్పంచ్ వెంకటేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు 90 శాతం సబ్సిడీ

కంది, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీని, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం ఉచితంగా మొక్కలు అందజేస్తుందని ఉద్యానవనశాఖ అధికారి శైలజ తెలిపారు. సోమవారం కందిలోని రైతువేదికలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేస్తే మంచి దిగుబడివస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్ గౌడ్, గోద్రేజ్ కంపెనీ మేనేజర్ భరత్, ఏఈవోలు లోహిత, సంగీత, రైతులు చంద్రయ్య, రాజు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు చేయాలి

రేగోడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వడ్లను కొనుగోలు చేయాలని కొండాపూర్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేశారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షాకాలం పొలం పనులకు వెళ్లలేకపోతున్నామని, ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ దత్తారెడ్డికి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.